సాక్షి ఆదిలాబాద్

శనివారం ¦ 19 ¦ అక్టోబర్ ¦ 2024



అగ్రగామిగా ట్రిపుల్ఐటీ

బాసర ట్రిపుల్ఐటీని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతామని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. వర్సిటీని శుక్రవారం సందర్శించారు. 8లో▸



ఎఫ్‌డీవో నియామకం ఎప్పుడో..

జన్నారం ఎఫ్‌డీవో పోస్టు ఖాళీగా ఉండడంతో పర్యవేక్షణ కరువైంది. మరోవైపు అటవీ డివిజన్‌లో స్మగ్లింగ్ పెరిగిపోతోంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
33.0/24.0

వాతావరణం

ఆకాశం పలుచోట్ల మేఘావృతమై ఉంటుంది. తుపాను ప్రభావంతో అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

సమయపాలన పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

నార్నూర్: అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. సీసీ కెమెరాలు ఎందుకు పనిచేయడం లేదని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

సెల్‌టవర్ నిర్మాణం ఆపాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధి 12వ వార్డు న్యూహౌసింగ్ బోర్డులో చేపట్టిన సెల్‌టవర్ నిర్మాణ పనులను ఆపాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం టవర్ నిర్మిస్తున్న ప్రాంతం వద్ద ఆందోళనకు దిగారు. జనావాసాల్లో అనుమతి లేకుండా నిర్మిస్తున్న సెల్‌టవర్‌తో రేడియేషన్ పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని వాపోయారు. అనుమతులు లేకుండా టవర్ ఏర్పాటు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే టవర్ నిర్మాణాన్ని నిలిపివేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. లేనిపక్షంలో నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో నర్సింలు

బేల: ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్–17బాలుర జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను మండలంలోని సిర్సన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఎంఈవో కోల నర్సింలు, ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కాంతారావు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణస్థాయిలో పోటీలు నిర్వహించడంతో పల్లె క్రీడాకారులకు గుర్తింపు లభిస్తుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఆయా పాఠశాలల నుంచి సుమారు 100మంది పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని జోనల్‌స్థాయి జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహాలక్ష్మి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కృష్ణ

తలమడుగు: ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో కృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. అలాగే ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి వంశీ, సిబ్బంది తదితరులున్నారు.

'హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం'

జైనథ్: ఎన్నికల హామీలు నెరవేర్చడంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. మండలంలోని సాత్నాలలో పార్టీ కార్యకర్తలతో శుక్రవారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల 24న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సభకు హాజరుకానున్న నేపథ్యంలో శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సభను జయప్రదం చేయాలని కోరారు. ఇందులో రైతు సమన్వయ జిల్లా అధ్యక్షుడు రోకండ్ల రమేశ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, గోవర్ధన్, భరత్, గంగయ్య, విజయ్‌సేట్, లక్ష్మణ్, రేణుకాబాయి, శ్రీరామ్, పొచ్చన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఔడా.. సిద్ధం?

- 'ఏజెన్సీ' మినహా మిగతా గ్రామాలతో ప్రతిపాదనలు
- ప్రభుత్వానికి నివేదించిన అధికారులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంతో పాటు దాన్ని ఆనుకుని ఉన్న గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందు కోసం ప్రత్యేకంగా ఆదిలాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఔడా) ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ మేరకు కసరత్తు చేపట్టిన యంత్రాంగం ఔడా పరిధిలోకి వచ్చే గ్రామాలతో కూడిన వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో ఏజెన్సీ ప్రాంతాలను మినహాయించినట్లు తెలిసింది. ఆయా గ్రామాలు ఎంత దూరంలో ఉండాలనే పరిమితి లేకపోవడంతో మైదాన ప్రాంత గ్రామ పంచాయతీలన్నింటినీ పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోకి తీసుకొచ్చేలా అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం. సర్కారు ఆమోదం లభించినట్లైతే త్వరలోనే పట్టణాభివృద్ధి సంస్థ కార్యరూపం దాల్చనుంది. తద్వారా జిల్లా కేంద్రంతో పాటు దాని పరిధిలోకి వచ్చే ఆయా పంచాయతీలకు ప్రత్యేక నిధులు సమకూరి సౌకర్యాలు మెరుగుపడే అవకాశముంది.

221 పంచాయతీలతో..

ఆదిలాబాద్ జిల్లా.. ఆదిలాబాద్, బోథ్ పూర్తిస్థాయి నియోజకవర్గాలతో పాటు పాక్షికమైన ఆసిఫాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాలతో విస్తరించింది. ఆదిలాబాద్ మున్సిపాలిటీతో పాటు 17 గ్రామీణ మండలాలు కలిగి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లాలతో పోల్చితే జిల్లాలో ఏజెన్సీ ప్రాంతం ఎక్కువ. ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ, ఉట్నూర్ వంటి నాలుగు మండలాలు పూర్తిగా ఏజెన్సీ ఏరియాలోనే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 473 జీపీలు ఉండగా 252 పూర్తిగా ఏజెన్సీ గ్రామాలే. 221 జీపీలు మాత్రమే మైదాన ప్రాంతంలో ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతాలను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి తీసుకొచ్చే అవకాశం లేకపోవడంతో వాటిని మినహాయించారు. జైనథ్ మండలంలోని జాతీయ రహదారి గుండా ఉన్న గ్రామాలతో పాటు బేల వరకు పలు గ్రామాలను ఇందులోకి చేర్చనున్నట్లుగా తెలిసింది. వాటితో పాటు మిగతా 11 మండలాల్లోని 221 గ్రామ పంచాయతీలతో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం. ప్రభుత్వ అనుమతి లభిస్తే ఆదిలాబాద్ మున్సిపాలిటీతో పాటు ఆయా గ్రామ పంచాయతీలన్నీ ఔడా పరిధిలోకి వచ్చే అవకాశముంది. దీనికి ప్రత్యేక పాలకవర్గం అందుబాటులోకి వచ్చి నిధులు సైతం పెద్ద మొత్తంలో విడుదలయ్యే అవకాశముంది.

ఏజెన్సీ గ్రామాలు మినహా

వరంగల్, నిజామాబాద్ పట్టణ ప్రాంతాలకు ఎలాగైతే కుడా, నుడా వంటి అభివృద్ధి సంస్థలున్నాయో వాటి మాదిరిగానే జిల్లాలోనూ ఆదిలాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రతిపాదనలు పంపించాల్సిందిగా గత నెల 26న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు డిస్ట్రిక్ట్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఆఫీసర్ (డీటీసీపీఓ), జిల్లా పంచాయతీ అధికారులు కసరత్తు చేపట్టారు. తొలుత ఆదిలాబాద్ మున్సిపాలిటీని ఆనుకుని 20 కిలోమీటర్ల లోపు ఉన్న గ్రామాలను ఈ సంస్థ పరిధిలోకి తీసుకురావాలని భావించారు. అయితే పట్టణానికి ఆనుకుని ఏజెన్సీ గ్రామాలు ఎక్కువగా ఉండటం సమస్యగా మారింది. దీన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ ప్రాంతాలను మినహాయించాలనే అధికారుల సూచనల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఎలాంటి సమస్య లేని మావల, బట్టిసావర్గాం, చాంద–టి, భీంసరి, జందాపూర్, పొన్నారి గ్రామాలను ఔడా పరిధిలోకి తీసుకురావాలని భావించారు. అయితే రాష్ట్రంలోని ఇతర జిల్లాలు పదుల సంఖ్యతో కూడిన గ్రామాలను సంస్థ పరిధిలోకి తీసుకురావడం, ఏ గ్రామం ఎంత దూరంలో ఉండాలనే మార్గదర్శకాలేమి లేకపోవడంతో జిల్లాలోని మైదాన ప్రాంత గ్రామ పంచాయతీలన్నింటిని కలపాలని నిర్ణయించారు. ఆ దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

అధికారుల్లో స్పష్టత కరవు...

ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలపై వాటిని సిద్ధం చేసిన జిల్లా పంచాయతీ, డీటీసీపీవోతో పాటు కలెక్టరేట్ అధికారుల్లోనూ స్పష్టత లేకపోవడం విశేషం. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి సంబంధించి ఎలాంటి ప్రతిపాదనలు పంపించారనే దానిపై డీటీసీపీవో సుమలతను సంప్రదించగా.. తాము జిల్లాలోని వివరాలు మాత్రమే అందించామని ప్రతిపాదనలు కలెక్టరేట్ నుంచే పంపించారని దాటవేత ధోరణి ప్రదర్శించారు. డీఎల్‌పీవో ఫణిందర్‌రావును సంప్రదించగా ప్రతిపాదనలు డీటీసీపీవోనే తయారు చేశారని వారి ద్వారానే ప్రభుత్వానికి వెళతాయని సమాధానమిచ్చారు. కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపించే నివేదికల్లో కీలకపాత్ర పోషించే కలెక్టరేట్ ఏవో బి.రాంరెడ్డిని సంప్రదించగా జిల్లా పంచాయతీ శాఖ ద్వారానే వాటిని పంపించారని ఆ వివరాలేమి తమ వద్ద లేవని డీపీవోను అడగాలని పేర్కొనడం గమనార్హం.

నాణ్యమైన పత్తికి 'మద్దతు'

- కలెక్టర్ రాజర్షి షా
- తేమశాతం నిర్ధారణపై సిబ్బందికి శిక్షణ
- కొనుగోళ్ల ఏర్పాట్లపై సమీక్ష



తేమశాతం స్వయంగా పరిశీలిస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: రైతులు నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మార్కెట్ యార్డులో తేమశాతం పరిశీలించేందుకు ఎంపిక చేసిన ఐకేపీ, మార్కెట్ కమిటీ సిబ్బందికి శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మూడు రకాల పత్తిని కుప్పలుగా పోసి కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు తేమశాతం 8కి మించకుండా పత్తిని ఇంటి వద్ద ఆరబెట్టుకొని తీసుకురావాలని సూచించారు. ఈ మేరకు సిబ్బంది అన్నదాతకు అవగాహన కల్పించాలన్నారు. కేంద్రాలకు రాగానే వారికి టోకెన్స్ ఇవ్వాలన్నారు. రైతులు కూడా ఒకేసారి కాకుండా దశల వారీగా పత్తిని తీసుకురావాలన్నారు. పూర్తిగా ఆరిన తరువాతే అమ్మకానికి తేవాలని, నీళ్లు చల్లితే సీసీఐ కొనుగోలు చేయదన్నారు. నాణ్యమైన పత్తి క్వింటాలుకు రూ.7,521 కనీస మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయిందన్నారు. తేమ నిర్ధారణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం వ్యాపారులు, సీసీఐ, మార్కెటింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 23, 24 తేదీల్లో కొనుగోళ్లు ప్రారంభమయ్యే అవకాశముందని అప్పటి వరకు ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, మార్కెటింగ్ జిల్లా అధికారి వై.గజానంద్, మార్కెట్ కార్యదర్శి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకంపై అవగాహన అవసరం

- కలెక్టర్ రాజర్షి షా



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

కైలాస్‌నగర్: పర్యాటక రంగంపై విద్యార్థులు అవగాహన ఉండాలని, ప్రతిఒక్కరూ చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలను తెలుసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో స్థానిక టీటీడీసీలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యాటక రంగ ప్రాధాన్యత, దాని ద్వారా జరిగే ఆర్థికాభివృద్ధిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఎన్నో చారిత్రక, పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, వాటిని తప్పకుండా తెలుసుకోవాలన్నారు. పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం వ్యాసరచన, ఉపన్యాస, డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమోంటోలు అందజేసి అభినందించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలచ్రల్, వైల్డ్‌లైఫ్ విభాగ ఫోటోల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఈవో ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–2.3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నవంబర్, డిసెంబర్ నెలల్లో నిర్వహించనున్న గ్రూప్–2,3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. పరీక్షల నిర్వహణపై టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్–3, డిసెంబర్ 15,16 తేదీల్లో గ్రూప్–2 పరీక్షల నేపథ్యంలో జిల్లాలో 29 కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రశ్నపత్రాలు, ఇతర మెటీరియల్‌ను గట్టి బందోబస్తు నడుమ ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో భద్రపర్చేందుకు స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 10,488 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్‌అర్బన్‌లో 14, ఆదిలాబాద్ రూరల్‌లో 4, మావలలో 10, జైనథ్‌లో ఒకటి చొప్పున కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నోడల్ అధికారులను సైతం నియమించినట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అదనపు ఎస్పీ సురేందర్ రావు, నోడల్ అధికారి జగ్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



సర్టిఫికెట్లు అందుకున్న వారితో ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. పీఎం విశ్వకర్మ పథకంలో భాగంగా శిక్షణ పొందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సర్టిఫికెట్లు ప్రదా నం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుల వృత్తులను అభివృద్ధి చేయాలనే ఆలోచనతోనే ప్రధాని మోదీ ఈ పథకానికి శ్రీ కారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారు నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లాలామున్నా, ప్రవీణ్, రఘుపతి, భరత్, దయాకర్, అశోక్‌రెడ్డి తదితరులున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

బోథ్: మండలంలోని ధన్నూర్, కనుగుట్ట ప్రభుత్వ పాఠశాలలను డీఈవో ప్రణీత శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలన్నారు. ధన్నూర్ పాఠశాలలో ఇటీవల నూతనంగా చేరి విధులు నిర్వర్తిస్తున్న సారికను శాలువాతో సత్కరించారు. అలాగే కేజీబీవీలో విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సీసీ రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.



నూతన ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న డీఈవో

వ్యవసాయ శాఖలో ఉద్యోగం అంటూ ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ నిరుద్యోగిని వారు నమ్మించారు. రూ.లక్ష వరకు డిమాండ్ చేశారు. వారి మాటలు నమ్మిన సదరు వ్యక్తి పది రోజుల క్రితం రూ.20వేలు ఫోన్‌పే ద్వారా ఆ సంస్థ నిర్వాహకులకు పంపించాడు. జాబ్ ఇంకెప్పుడు అంటే రేపూమాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. డబ్బులు తిరిగి ఇవ్వకపోగా, అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చేది ఉందంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

ఆదిలాబాద్ పట్టణంలో ఓ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. ఆ ముసుగులో నిర్వాహకులు రుణాల పేరిట అమాయకులను నమ్మిస్తున్నారు. గ్రామాల్లో పలువురు ఏజెంట్లను నియమించుకొని గ్రూపులుగా తయారు చేస్తున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.12వేల వరకు వసూలు చేస్తున్నారు. ముద్ర రుణం పేరిట రూ.5లక్షలు, రూ.10లక్షలు ఇస్తామని మాయమాటలు చెప్పి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. ప్రతిరోజూ బాధితులు ఆఫీస్‌కు వచ్చి ఆందోళనకు దిగుతున్నారు.

నమ్మిస్తూ.. ముంచేస్తూ

- ఉద్యోగాల పేరిట వసూళ్లు
- స్వచ్ఛంద సంస్థ ముసుగులో దందా
- రుణాలు ఇప్పిస్తామంటూ పల్లెల్లోనూ టోకరా
- లబోదిబోమంటున్న బాధితులు

ఆదిలాబాద్‌టౌన్: మోసపోయేవారు ఉంటే.. మోసం చేసేవారు పుట్టుకొస్తూనే ఉంటారు. అమాయకులను ఆసరాగా చేసుకొని ఉద్యోగాలు.. రుణాలు ఇప్పిస్తామంటూ కొందరు డబ్బులు వసూలు చేస్తూ అక్రమ దందా సాగిస్తున్నారు. ఇప్పటికే పలువురు జిల్లాలో కటకటాల పాలైనా మిగతా వారిలో సైతం మార్పు రావడం లేదు. ఇంత జరుగుతున్నా నిరుద్యోగులు వారి వలలో చిక్కుతూనే ఉన్నారు. గతంలో ఆదిలాబాద్ పట్టణంలో స్వచ్ఛంద సంస్థ ద్వారా రుణాలు ఇస్తామని పలువురు మోసాలకు పాల్పడ్డారు. మాయమాటలు చెప్పి వారి నుంచి డబ్బులు వసూలు చేసి ఉడాయించిన ఘటనలు లేకపోలేదు. అలాంటి కోవలో మరో స్వచ్ఛంద సంస్థ జిల్లా కేంద్రంలో వెలిసింది. అందినకాడికి దండుకొని ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిరుద్యోగులకు వల..

హైదరాబాద్, కరీంనగర్‌కు చెందిన కొన్ని స్వచ్ఛంద సంస్థలు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ఆపరేటర్, స్కావెంజర్లను నియమిస్తామని అమాయక నిరుద్యోగులకు గాలం వేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో చాలామంది పలు స్వచ్ఛంద సంస్థలకు రూ.2లక్షల వరకు ఇచ్చి వారి చుట్టూ తిరుగుతున్నారు. కొంత మందిని పాఠశాలల్లో ఉద్యోగం పేరిట చేర్పించారు. వారికి నెలకు రూ.18వేలు ఇస్తామని అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీ ఇచ్చారు. మూడు నాలుగు నెలలు గడిచినా ఒక్కరికి కూడా వేతనం చెల్లించలేదు. ఆ సంస్థల ద్వారా ఉద్యోగం ఇప్పిస్తామని నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి అందినకాడికి దోచుకునేందుకు జిల్లా కేంద్రంలోనే ఈ సంస్థ మకాం వేసింది. ఇప్పటికే చాలా మంది వీరి వలలో చిక్కుకున్నారు. ఫోన్‌పే, నగదు రూపంలో డబ్బులు తీసుకొని ఉద్యోగం ఇప్పించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు బాధితులు పేర్కొంటున్నారు.

డబ్బులు ఇచ్చి మోసపోవద్దు



ఉద్యోగాల పేరిట ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే నిరాకరించాలి. ఇటీవల ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి కొందరు డబ్బులు దండుకుంటున్నారు. రుణాలు ఇప్పిస్తామని ఇటీవల ఓ సంస్థ నిర్వాహకులు వసూలు చేసినట్లు మా దృష్టికి వచ్చింది. బాధితులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తాం.

– ఎల్.జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ డీఎస్పీ

రుణాల పేరిట మోసం..

జిల్లాకేంద్రంలో ఓ సంస్థ పేరిట దుకాణం తెరిచారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నారు. గ్రామాలకు వెళ్లి ఐదారుగురిని ఒక గ్రూప్‌గా తయారు చేసి రూ.12వేల చొప్పున డబ్బులు తీసుకున్నారు. వారికి ముద్ర రుణం పేరిట రూ.10లక్షలు, రూ.5లక్షలు ఇప్పిస్తామని బుకాయించారు. మావల మండలంలోని వాగాపూర్, తలమడుగు మండలంలోని రుయ్యాడి, కజ్జర్ల, ఆదిలాబాద్‌అర్బన్ మండలంలోని రాంపూర్, ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అంకాపూర్‌తో పాటు పలు గ్రామాలకు చెందిన వారి నుంచి సైతం డబ్బులు తీసుకున్నారు. 20 రోజుల్లో రుణం ఇస్తామని చెప్పి తొమ్మిది నెలలు గడిచినా వారికి ఎలాంటి రుణం ఇవ్వలేదు. తీసుకున్న డబ్బులు సైతం తిరిగి చెల్లించకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. వీరిలో ఎక్కువ శాతం మంది అమాయక గిరిజనులే ఉన్నారు. కూలీనాలి చేసుకొని పోగు చేసుకున్న డబ్బులు ఈ స్వచ్ఛంద సంస్థలు దండుకొని ఉడాయిస్తున్నాయి. నిలదీసిన కొంత మందికి తిరిగి ఇస్తుండగా, మిగతా వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

కడెం: రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి కడెం ప్రాజెక్ట్‌లో చేప పిల్లలను శుక్రవారం విడుదల చేశారు. ఈసందర్భంగా చైర్మన్ సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అండగా నిలుస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీడ్ కాంట్రాక్టులు ఆంధ్రా వారికి అప్పగించి భారీ మోసాలకు పాల్పడిందని ఆరోపించారు. చేప పిల్లల పంపిణీని కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా చేపడుతుందన్నారు. కడెం ప్రాజెక్ట్‌లో తొమ్మిది లక్షల చేప పిల్లలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ మండల కేంద్రంలో త్వరలోనే చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమాల్లో నిర్మల్ ఆర్డీవో రత్నకళ్యాణి, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో అరుణ పాల్గొన్నారు.



ప్రాజెక్టులో చేప పిల్లలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు, చైర్మన్ సాయికుమార్

క్లుప్తంగా

నకిలీ బంగారం ముఠా సభ్యుడి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: అంతర్రాష్ట్ర నకిలీ బంగారం ముఠా సభ్యుడిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఈనెల 6న పట్టణంలోని రాధాకృష్ణ లాడ్జిలో గల లెడ్జర్ బుక్‌లను ఎత్తికెళ్లిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించగా, శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా డోన్ మండలం కొత్తబుర్జుకు చెందిన మరో నిందితుడు ఎరుకల సుధాకర్‌ను అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. కర్ణాటకలోని బల్లారికి చెందిన మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు

అంగన్‌వాడీలో కుళ్లిన కోడిగుడ్ల పంపిణీ



ఉడకబెట్టిన కోడిగుడ్లు

కోటపల్లి: మండలంలోని ఆలుగామ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నారని లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన పల్లె శ్రావణ్ భార్య గర్భిణి కావడంతో గురువారం అంగన్‌వాడీ టీచర్ కోడిగుడ్లు పంపిణీ చేసింది. శుక్రవారం ఉడికించగా దుర్వాసన రావడంతో పరిశీలించారు. కోడిగుడ్లు కుళ్లిపోయినట్లు గుర్తించి అంగన్‌వాడీ కేంద్రం టీచర్‌ను శ్రావణ్ ప్రశ్నించాడు. తమకు వచ్చిన కోడిగుడ్లను పంపిణీ చేశామని టీచర్ చెప్పడంతో చేసేదేమీ లేక వెనుదిరిగాడు. కాగా, అంగన్‌వాడీ కేంద్రం వద్ద చిన్నారులకు కోడిగుడ్లు వండించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా అవి కూడా దుర్వాసన రావడంతో పడేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఐసీడీఎస్ సీడీపీవో మనోరమను సంప్రదించగా.. కుళ్లిన కోడిగుడ్ల విషయం తమ దృష్టికి రాలేదని, చెడిపోయిన కోడిగుడ్లను తొలగించి మంచివి అందిస్తామని తెలిపారు. కాగా, మండలంలో గత రెండు నెలల్లో ఇది నాలుగో ఘటన కావడం గమనార్హం. కుళ్లిన కోడిగుడ్లతో చిన్నారులు, బాలింతలు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నా ఐసీడీఎస్ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

షాపులో చోరీ



షటర్ తాళాలు పగులకొట్టిన దృశ్యం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో మోటార్ వైండింగ్ షాపులో గురువారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం షాపు షటర్ తాళం పగులగొట్టి ఉండడం చూసి యజమాని పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రూ.4 లక్షల విలువ గల 9 క్వింటాళ్ల రాగి తీగ ఎత్తుకెళ్లినట్లు సమాచారం.

తాళం వేసిన ఇంట్లో..

జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్‌లో తాళం వేసిన ఓ ఇంట్లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పట్టణ ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. యజమాని భూమయ్య తన బంధువుల ఇంట్లో జరిగే వేడుకకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో 8 గ్రాముల బంగారం, 2 తులాల వెండి, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులు, యజమానికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఎఫ్‌డీవో నియామకం ఎప్పుడో..!

- డివిజన్‌లో పెరుగుతున్న స్మగ్లింగ్
- సిబ్బంది కొరతతో సతమతం



ఇటీవల అటవీ అధికారులు పట్టుకున్న బెడ్



కవ్వాల్ సెక్షన్‌లో స్మగ్లర్లు నరికివేసిన టేకు చెట్లు (ఫైల్)

జన్నారం: అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ సిబ్బంది పనితీరును పర్యవేక్షించే జన్నారం ఎఫ్‌డీవో పోస్టు ఖాళీగా ఉంది. దీంతో జన్నారం అటవీ డివిజన్‌లో కలప స్మగ్లింగ్ పెరిగిపోతోంది. కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో నాలుగు డివిజన్‌లు ఏర్పాటు చేసి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పులుల ఆవాసానికి అనువైన ప్రదేశంగా ఉన్న జన్నారం అటవీ డివిజన్‌లో అధికారుల ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. జన్నారం అటవీ డివిజన్‌లో మూడు అటవీ రేంజ్‌లు, 13సెక్షన్‌లు, 40 అటవీ బీట్‌లు ఉన్నాయి. వీటితోపాటు అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ఒక ఫారెస్టు డివిజనల్ అధికారి(ఎఫ్‌డీవో) ఉన్నారు. గత ఏడాది అక్టోబర్‌లో ఎఫ్‌డీవో మాధవరావు హైదరాబాద్‌లోని ఆ శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. మంచిర్యాల డీఎఫ్‌వోకు బాధ్యతలు అప్పగించారు. ఆయన నిత్యం ప్రభుత్వ, శాఖపరమైన పనుల్లో తీరిక లేకుండా ఉండడం వల్ల అప్పుడప్పుడు డివిజన్‌కు వచ్చి వెళ్తుంటారు. దీంతో కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. గత ఎఫ్‌డీవో చేపట్టిన కార్యక్రమాలతో డివిజన్‌లో కలప స్మగ్లింగ్, వన్యప్రాణుల వేట తగ్గింది. కింది స్థాయి సిబ్బంది నిత్యం విధుల్లో ఉండేవారు. ఎఫ్‌డీవో బదిలీతో గతంలో చేపట్టిన కార్యక్రమాలు ఏడాది కాలంగా నిలిచిపోయాయి. కలప స్మగ్లింగ్ జరిగే జన్నారం అటవీ డివిజన్‌లో ఏడాదిగా రేంజ్ అధికారులు ఇన్‌చార్జిలుగా ఉండడం గమనార్హం. ఇందన్‌పల్లి రేంజ్ అధికారిగా మంచిర్యాల డీఆర్వో హఫీజొద్దీన్ నాలుగేళ్లుగా పని చేసి లక్సెట్టిపేటకు బదిలీపై వెళ్లారు. జన్నారం రేంజ్ అధికారి సెలవుపై వెళ్లడంతో కొన్ని రోజులు ఇందన్‌పల్లి రేంజ్ అధికారి హఫీజొద్దీన్‌కు ఇన్‌చార్జిగా వ్యవహరించగా.. ప్రస్తుతం తాళ్లపేట్ రేంజ్ అధికారి సుష్మారావు ఇన్‌చార్జి రేంజ్ అధికారిగా ఉన్నారు.

స్థానికంగా ఉండని అధికారులు

జన్నారం అటవీ డివిజన్‌లోని కవ్వాల్ అటవీ సెక్షన్‌లో అధికారులు స్థానికంగా ఉండడం లేదు. ఈ సెక్షన్‌లో నాలుగు అటవీ బీట్‌లు ఉన్నాయి. విస్తీర్ణం, స్మగ్లింగ్ పరంగా పేరుంది. గతంలో సెక్షన్ అధికారి కవ్వాల్ సెక్షన్‌కు డీఆర్వోను నియమించారు. డీఆర్వోగా బాధ్యతలు చేపట్టిన హేమలత 15రోజులకే సెలవుపై వెళ్లారు. నలుగురు బీట్ అధికారుల్లో ఇద్దరు సెలవుపై వెళ్లడంతో ప్రస్తుతం ఒక ఇన్‌చార్జి సెక్షన్ అధికారి, ఇద్దరు బీట్ అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో బీట్ అధికారి ప్రణయ్ డీఎస్సీలో ఎంపిక కాగా.. ఆయన కూడా ఈ ఉద్యోగాన్ని వదిలి ఉపాధ్యాయ పోస్టులో చేరే అవకాశం ఉంది.

మే నుంచి అక్టోబర్ వరకు

ఈ ఏడాది మే నుంచి అక్టోబర్ వరకు డివిజన్‌లో పలు ప్రాంతాల నుంచి కలప తరలించగా అధికారులు పట్టుకున్నారు. మచ్చుకు కొన్ని సంఘటనలు
మేలో కవ్వాల్ అటవీ సెక్షన్ రాయికుంట బీట్‌లో స్మగ్లర్లు టేకు చెట్లను రంపంతో కోసి దుంగలను తీసుకెళ్లగా ఒకరిని గుర్తించి కేసు చేశారు.

- జూన్ 1న పడిపెల్లి బీట్‌లో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న రెండు టేకు చెట్లను రంపంతో కోయగా విద్యుత్ తీగలపై పడి మంటలు లేవడంతో రంపం, కలప అక్కడే వదిలి వెళ్లారు. ఈ సంఘటనలో ఇద్దరిపై కేసు చేశారు.
- జూన్ 6న కలప స్మగ్లింగ్ ఆరోపణలపై వెడ్మ లక్ష్మణ్‌ను అరెస్ట్ చేశారు.
- జూలై 25న కిష్టాపూర్ గ్రామంలో కుల్వకాయల మల్లేశ్ ఇంట్లో సోదాలు చేసి రూ.8,463 విలువైన కలప పట్టుకున్నారు.
- ఆగస్టు 21న కిష్టాపూర్ గ్రామంలో గాజుల మల్లేశ్ ఇంట్లో రూ.15 వేలు విలువైన 11 టేకు చెక్కలు, 4 దిమ్మెలు పట్టుకున్నారు.
- ఆగస్టు 2న తాళ్లపేట్ అటవీ రేంజ్ ఊట్ల బీట్ పరిధిలో అటవీశాఖ అధికారులు వెంబడించి రూ.34 వేల విలువైన 3 టేకు సైజులు 8 వాసాలు పట్టుకున్నారు.
- సెప్టెంబర్ 23న జన్నారం మండల కేంద్రంలోని శ్రీలంక కాలనీలో రూ.14 వేలు విలువైన నిల్వ ఉన్న కలప పట్టుకున్నారు.

వీటి ఆధారంగా పట్టుబడకుండా ఎంతో కలప తరలిపోతున్నట్లు తెలుస్తోంది.
ఈ విషయంలో ఉన్నత అధికారులు దృష్టి సారించి ఎఫ్‌డీవో నియామకం చేసి, పెరుగుతున్న స్మగ్లింగ్ నిరోధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పెరుగుతున్న స్మగ్లింగ్

జన్నారం అటవీ డివిజన్‌లో గతంతో పోలిస్తే స్మగ్లింగ్ పెరుగుతోంది. ఇటీవల పలు ప్రాంతాల్లో అధికారులు కలప పట్టుకున్న సంఘటనలే నిదర్శనం. డివిజన్‌లోని కవ్వాల్ సెక్షన్, మహ్మదాబాద్, తాళ్లపేట్ రేంజ్‌లోని పలు ప్రాంతాల నుంచి స్మగ్లింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. మహ్మదాబాద్ సెక్షన్‌లోని పలు ప్రాంతాల్లో స్మగ్లర్లు అధికారుల కళ్లుగప్పి కలప తరలిస్తున్నారు. అటవీ ప్రాంతాల నుంచి చింతగూడెం సమీపం నుంచి గోదావరి దాటిస్తున్నట్లు సమాచారం. గోదావరి ప్రాంతాలైన తపాలపూర్, రాంపూర్, చింతగూడ గ్రామాల గుండా కొందరు గుట్టు చప్పుడు కాకుండా కలప తరలిస్తున్నారు. కవ్వాల్ సెక్షన్ నుంచి ద్విచక్ర వాహనాల ద్వారా తరలిస్తున్నట్లు తెలిసింది. కొందరు వ్యక్తులు ఎడ్లబండ్ల ద్వార దుంగలను తరలిస్తూ రాత్రికి రాత్రే మిషన్ల ద్వారా కోయిస్తున్నారు. కాగా, ఎఫ్‌డీవో నియామకంపై కవ్వాల్ టైగర్‌జోన్ ఎఫ్‌డీపీటీ శాంతారాంను సంప్రదించగా.. ఫారెస్ట్ డివిజన్ అధికారి బదిలీలు, నియామకాలు ప్రభుత్వం చేతిలో ఉంటాయని, త్వరలో నియామకం అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

అధిక సాంద్రత సాగుతో లాభాలు అధికం



రైతులకు అవగాహన కల్పిస్తున్న శివకృష్ణ, సునీల్ మహాజన్

బెల్లంపల్లిరూరల్: పత్తి సాగులో అధిక సాంద్రత పద్ధతి పాటించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ, జాతీయ పత్తి పరిశోధనసంస్థ నాగ్‌పూర్ ప్రధాన శాస్త్రవేత్త సునీల్ మహాజన్ అన్నారు. మండలంలోని మాల గురిజాల శివారులో అధిక సాంద్రత పద్ధతి ద్వారా రైతులు సాగు చేస్తున్న పత్తి పంటలను శుక్రవారం సందర్శించారు. సాగులో తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 425 ఎకరాల్లో రైతు క్షేత్ర ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, రైతులు ఉన్నారు.

కల్వర్టును ఢీకొన్న వాహనం

భైంసారూరల్: భైంసా–బాసర ప్రధాన రహదారిపై దేగాం సమీపంలో వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వాస్తర్ సాయినాథ్ మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు..భైంసాలోని భట్టిగల్లీకి చెందిన డ్రైవర్ వాస్తర్ సాయినాథ్ (34) శుక్రవారం భైంసా నుంచి యూరియా బస్తాలతో వాహనంలో బాసరకు వెళ్తున్నాడు. ఈక్రమంలో కల్వర్టును ఢీకొనడంతో సాయినాథ్ సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అన్నిరంగాల్లో అగ్రగామిగా ట్రిపుల్‌ఐటీ

- ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్



క్యాంపస్‌లో అధికారులతో మాట్లాడుతున్న వీసీ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతామని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. బాసర ట్రిపుల్‌ఐటీకి శుక్రవారం చేరుకున్న ఆయనకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగీ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం క్యాంపస్‌లోని వీసీ చాంబర్‌లో వర్సిటీ స్థితిగతులపై ప్రొఫెసర్ గోవర్ధన్ సమీక్ష నిర్వహించారు. అనంతరం మెస్‌లను పరిశీలించారు. డైనింగ్‌హాల్, కిచెన్, స్టోర్‌రూంలను పరిశీలించారు. పరిశుభ్రతతోపాటు మెస్‌లలో వినియోగించే వస్తువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పరిపాలన భవనంలో అసోసియేట్ డీన్స్, స్టూడెంట్ వెల్ఫేర్ అధికారులతో సమావేశమయ్యారు. ట్రిపుల్‌ఐటీలో పోస్టుల వివరాలు, అకడమిక్ క్యాలెండర్, వసతి గృహాల వివరాలు, విద్యార్థుల సంఖ్య ఇలా పలు అంశాలను అడిగితెలుసుకున్నారు. ట్రిపుల్‌ఐటీలో సాంకేతిక విద్యతోపాటు క్రీడా, సాంస్కృతిక రంగాల్లో రాణించేలా విద్యార్థులను ప్రొత్సహిస్తామన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తు విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీసి అందుకు అవసరమయ్యే నూతన కోర్సులు ప్రవేశొపెడతామని తెలిపారు. విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. ప్రభుత్వంతో సంప్రదించి పెండింగ్ పనులు ఉంటే పూర్తిచేయిస్తామని పేర్కొన్నారు. ట్రిపుల్‌ఐటీలో ఫైనాన్స్ సెక్షన్, స్కాలర్‌షిప్ సెక్షన్, అకడమిక్ సెక్షన్, స్టూడెంట్ వెల్ఫేర్ సెక్షన్, లైబ్రేరీతోపాటు పలు సెక్షన్‌లలో తనిఖీల గురించి అడిగితెలుసుకున్నారు. ట్రిపుల్‌ఐటీలో సమస్యలు పరిష్కరించడమే తన ముందు ఉన్న ప్రధాన లక్ష్యమని తెలిపారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

- 1.5 కిలోల గంజాయి, ఒక వ్యాన్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: వివిధ ప్రాంతాలకు గంజాయి తరలిస్తున్న కేసులో నలుగురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ సీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాలతో గతనెలలో తలమడుగు పోలీసుస్టేషన్ పరిధిలో మహారాష్ట్రతో అనుసంధానంగా ఉన్న లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్ వద్ద భారీఎత్తున గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఆ కేసులో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలోని బుల్దాన జిల్లాకు చెందిన గోతిరాం గురుదయాల్ సాబ్లే, శుభం గోతిరాం సాబ్లే, అమర్‌సింగ్ నారాయణ గోతి, సోమనాథ్ బికా అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1.5 కిలోల గంజాయి, ఒక వ్యాన్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న ఆదిలాబాద్ రూరల్, జైనథ్ సీఐలు ఫణిధర్, సాయినాథ్, ఎస్సై ముజాహిద్, పోలీసు సిబ్బంది రుక్మారెడ్డి, గంగాధర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులను ఎస్పీ అభినందించి, నగదు పురస్కారం ప్రకటించారు.

రాపల్లిలో పరస్పర దాడులు

- మంచిర్యాల ప్రైవేట్ ఆస్పత్రిలో నాటకీయ పరిణామాలు
- ఇరువర్గాల్లో పలువురికి గాయాలు, చికిత్స



మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



గాయపడిన శ్రీనివాస్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఇరువర్గాలపై జరిగిన దాడులకు రాజకీయ రంగు పులుముకుంది. శుక్రవారం హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నేత, మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్, అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకుల మధ్య జరిగిన పరస్పర దాడులు చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..మాజీ వైస్ ఎం పీపీ శ్రీనివాస్ ఉదయం రాపల్లి వైపు వెళ్తుండగా పునరావాస కాలనీ సమీపంలో తంగెళ్ల రామేశ్, తంగెళ్ల సాగర్, దేనవేణి రాజశేఖర్‌లకు మధ్య గొడవ జరిగింది. శ్రీనివాస్ రోడ్డుకు కారు అడ్డంగా పెట్టడం, తమ బైక్ ఢీకొనడం వల్ల తమకు గాయాలయ్యాయని ఇరువర్గాల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఒకరిపై ఒకరు చేసుకున్న దాడుల్లో ఇరువురికి గాయాలు కాగా మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆయన్ను పరామర్శించారు. శ్రీనివాస్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలో పోలీసులకు సహకరించినా పార్టీ కార్యకర్తలు అడ్డుకునే క్రమంలో తోపులాట చోటు చేసుకుంది. ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాస్ గురించి ఆరా తీయగా తీసుకురాలేదని చెప్పడంతో అంతా కంగుతిన్నారు. చివరకు లక్సెట్టిపేట కోర్టుకు తరలించనట్లు తేలడంతో తదుపరి చర్యలకు ఉపక్రమించారు. కాగా, తన భర్త శ్రీనివాస్‌పై అన్యాయంగా దాడి చేసి గాయపర్చారని మాజీ ఎంపీపీ స్వర్ణలత అన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మరోవర్గం బాధితులు

పరస్పర దాడిలో గాయపడిన మరోవర్గం బాధితులు తంగెళ్ల రామేశ్, తంగెళ్ల సాగర్, దేనవేణి రాజశేఖర్ మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులను కాంగ్రెస్ నాయకులు తోట రావు, శ్రీనివాసగౌడ్, సతీశ్‌రావు, దొమ్మటి సత్తయ్య, బొడ్డు శంకర్ తదితరులు పరామర్శించారు. దాడి ఘటనపై బాధితులు ఫిర్యాదు చేశారు.

ఇరువర్గాలపై కేసులు

ఇరువర్గాల వారు ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు ఏఎస్సై చాంద్ తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్‌పై 109, 307, 324, రెడ్ విత్ 34 సెక్షన్ నమోదు కాగా, తంగెళ్ల రమేశ్, సాగర్, దేనవేని రాజశేఖర్‌లపై 324, రెడ్ విత్ 34 సెక్షన్ నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..రాపల్లి గ్రామానికి చెందిన తంగెళ్ల రమేశ్, తంగెళ్ల సాగర్, దేనవేని రాజశేఖర్‌ల మధ్య పాత గొడవలు కక్షల కారణంగా మాజీ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్ తన కారుతో వారిని అడ్డగించి ఇనుప రాడ్‌తో దాడి చేశాడు. ఇందులో తంగెళ్ల రమేశ్ కాలు విరిగిపోగా రాజశేఖర్, సాగర్‌కు గాయాలయ్యాయి. అయితే వీరి దాడిలో శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి.

కడుపునొప్పి భరించలేక ఒకరు ఆత్మహత్య



లింగయ్య (ఫైల్)

దండేపల్లి: కడుపునొప్పి భరించలేక ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కాసిపేటకు చెందిన చిరుత లింగయ్య(44)కు గత రెండేళ్ల క్రితం లివర్ చెడిపోవడంతో ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. కొన్నిరోజులు బాగానే ఉన్న అతనికి ఈ మధ్య కడుపునొప్పితో బాధపడుతున్నాడు. స్థానికంగా చికిత్స చేయించుకున్న నయం కావడం లేదు. పెద్ద ఆసుపత్రికి వెళ్దామంటే ఆర్థికంగా ఇబ్బందులు ఉండటం, తీవ్ర మనస్తాపంతో శుక్రవారం తెల్లవారుజామున గడ్డిమందు తాగి వాంతులు చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం లక్సెట్టిపేటకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య సుజాత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..



మృతుడి వివరాలు సేకరిస్తున్న ఏఎస్సై పోశెట్టి

వాంకిడి: మద్యానికి బానిసై వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై పోశెట్టి కథనం ప్రకారం..మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన మస్నే రావుజి(45) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. డబ్బులు లేని సందర్భాల్లో ఇంట్లో వస్తువులు అమ్మి మద్యం కొనుగోలు చేసుకునేవాడు. కుటుంబ సభ్యులు ఎంత సముదాయించినా మార్పు రాలేదు. ఈక్రమంలో గురువారం సాయంత్రం జీవితంపై విరక్తితో రావుజి.. పశువుల కొట్టంలో పురుగుల మందు తాగి వాంతులు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. భార్య మస్నే సునీత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

తాంసి మండలంలో ఒకరు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న తాంసి ఎస్సై శివరాం

తాంసి: పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని వడ్డాడి వద్ద మత్తడివాగు ప్రాజెక్టు సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై శివరాం కథనం ప్రకారం..ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన చౌడారపు హరికృష్ణ (27) గత కొంతకాలంగా మానసిక వ్యాధి తో బాధపడుతున్నాడు. శుక్రవారం ఉదయం ఆలయానికి వెళ్తున్నానని ఇంట్లో వారికి చెప్పి బైక్‌పై బయల్దేరాడు. మత్తడివాగు ప్రాజెక్టు వద్ద చేరుకుని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి అందించిన సమాచారంతో ఎస్సై అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. తల్లి అరుణ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, మృతుడి సోదరుడు సాయికృష్ణ 2019లో మత్తడివాగు ప్రాజెక్టు వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

జీవితంపై విరక్తితో ఒకరు

ఆదిలాబాద్‌టౌన్: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్సై అశోక్ కథనం ప్రకారం..ఖుర్షాపూర్‌కు చెందిన హన్మాండ్లు (35)కు తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. సంతానం కావడం లేదని భార్య రెండేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకుంది. దీంతో మనోవేదనకు గురై మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి రాములు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడు..



దోంగ్రే సచిన్(ఫైల్)

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన యువకుడు దోంగ్రే సచిన్ ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై రాందాస్ కథనం ప్రకారం.. సచిన్ (29) మద్యానికి బానిసయ్యాడు. పైగా అప్పులు చేసి తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్లాబ్‌కు నైలాన్ తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మౌనిక ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి



షేక్ అహ్మద్ మృతదేహం

ముధోల్: మద్యానికి బానిసై వ్యక్తి జీవితంపై విరక్తితో ఉరేసుకుని ఆత్మహత్య కు పాల్పడినట్లు ఏఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని తరోడా గ్రామానికి చెందిన షేక్ అహ్మద్(50) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



డివైడర్ ఎక్కిన లారీ

బెల్లంపల్లి: హైదరాబాద్–చంద్రపూర్ నేషనల్ హైవే 363పై రోడ్డు ప్రమాదం త్రుటిలో తప్పింది. గురువారం సాయంత్రం ఆసిఫాబాద్ వైపు నుంచి మంచిర్యాలకు లారీ వెళ్తోంది. బెల్లంపల్లి బైపాస్ వద్ద లారీ టైర్ పగిలి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ సమయంలో వాహనాలేవి రాకపోవడంతో ప్రమాదం తప్పింది. టూటౌన్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ కోసం నేషనల్ హైవే అధికారులకు సమాచారం అందజేశారు. శుక్రవారం కొత్త టైర్ మార్చి లారీని తీసుకువెళ్లారు.

అదుపుతప్పి లోయలో పడ్డ కారు



బోల్తాపడ్డ కారు

రామకృష్టాపూర్: రామకృష్టాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్‌కే ఓసీ, అమరవాది చెరువు సమీపంలో శుక్రవారం ఓ కారు అదుపుతప్పి చిన్న లోయలో పడింది. పట్టణానికి చెందిన కిరణ్ శ్రీరాంపూర్ నుంచి ఆర్‌కేపీకి వస్తుండగా కారు అదుపుతప్పి స్తంభాన్ని వేగంగా ఢీకొని లోయలో పడిపోయింది. కాగా, కిరణ్‌కు ప్రాణాపాయం తప్పింది.